క్లుప్తంగా

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె సిటీ: స్థానిక ఆరోగ్యవరంలో సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంటులో భాగంగా మూడో రోజు వివిధ జట్లుకు పోటీలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగు చంద్ర పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మూడో రోజు వివిధ జట్లు పోటీలకు తలపడ్డాయి. నాయుడుపేట-హుబ్లీ పోటీపడగా 1-0 స్కోరుతో నాయుడుపేట గెలిచింది. కేరళ-ఎఎంసి-ఎ తలపడగా 5-0 స్కోరుతో కేరళ విజయం సాధించింది.

ఎంపీ నిధులతో మసీదులో అభివృద్ధి పనులు

పెద్దమండ్యం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి కేటాయించిన నిధులతో కలిచెర్ల పాతురులోని జామియా మసీదులో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మసీదులో అభివృద్ధి పనుల కోసం రూ. 10 లక్షల నిధులు కేటాయించాలని జామియా మసీదు కమిటీ సభ్యులు ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలను కోరారు. ఇటీవల ఎంపీ జామియా మసీదు అభివృద్ధి పనుల కోసం రూ. 4 లక్షలు కేటాయించారు. దీంతో కమిటీ సభ్యులు మసీదులో అభివృద్ధి పనులు చేపట్టారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు మసీదు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విష ప్రయోగంతో ఎనిమిది కోళ్లు మృతి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పోతుపేటకు చెందిన గొడుగు భాస్కర్‌రెడ్డికి చెందిన ఎనిమిది నాటు కోళ్ళు బుధవారం అకస్మాత్తుగా మృత్యువాత పడ్డాయి. గిట్టని వారు ఎవరో కోళ్లు తినే ఆహారంలో గుళికల మందు వేయడంతోనే రూ.3 వేల విలువ చేసే కోళ్లు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో కూడా రూ.10 వేల విలువ చేసే కోళ్లు ఇలా అర్ధాంతరంగా చనిపోయాయని బాధిత వ్యక్తి వాపోయాడు.

పల్లెబాటను విజయవంతం చేయాలి

తంబళ్లపల్లె: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెబాట కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు నారాయణరెడ్డి కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం నియోజకవర్గంలోని బడికాయలపల్లె, మద్దినాయునిపల్లె,పోతుపేట, అన్నగారిపల్లెలో జరిగిన పల్లెబాట కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్తూ సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులతో అక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ భార్గవరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

బి.కొత్తకోట: స్థానిక ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలపై వ్యవసాయశాఖ మదనపల్లె ఏడీఏ శివశంకర్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఐదు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా ఒక దుకాణంలో బిల్లులు, స్టాక్ రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా లేదని రూ.1.33 లక్షల పురుగుమందుల విక్రయాలను నిలుపుదల చేయించారు. 21 రోజులు విక్రయాలు జరపరాదని నిషేధం విధించారు. తనిఖీ చేసిన దుకాణాల్లో చిన్నచిన్న లోపాలు గుర్తించామని, వాటిపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కలర్ గ్రానైట్ క్వారీలపై ప్రజాభిప్రాయ సేకరణ

మదనపల్లె : మండలంలోని వలసపల్లె, కోటవారిపల్లె పంచాయతీలో కలర్ గ్రానైట్ క్వారీల నిర్వహణకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అక్రమ్‌పాషా, ఐశ్వర్య పబ్లిసిటీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతుల మంజూరు విషయమై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. బుధవారం డీఆర్వో సత్యనారాయణ, కడప పీసీబీ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అశోక్‌కుమార్, తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌లు కోటవారిపల్లె, వలసపల్లె పంచాయతీలకు చెందిన ప్రజలతో సమావేశం నిర్వహించారు. కోటవారిపల్లె పంచాయతీ సర్వేనెం.691/పి.లో 7.046 హెక్టార్లు, వలసపల్లె పంచాయతీ సర్వేనెం.650లోని 2.554 హెక్టార్లలో కలర్ గ్రానైట్ క్వారీ అనుమతులపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. పర్యావరణానికి ఏమైనా నష్టం కలుగుతుందా అనే అంశాలను పరిశీలించారు.

రాయితీ యంత్రాలు సకాలంలో అందించాలి

కలకడ : మండలంలోని రైతులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రాయితీ యంత్రాలను సకాలంలో అందించాలని ఎంపీపీ శ్రీదేవి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్‌బీకేల అధ్యక్షుడు చింతకుంట హరినాథరెడ్డి మాట్లాడుతూ రాయితీపై మంజూరు చేసే ట్రాక్టర్లు, విత్తన శుద్ధి యంత్రాలు సకాలంలో అందించాలని కోరారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా12 రైతు సంఘాలకు 66.47 లక్షలు మంజూరుకాగా రాయితీ రూ.26.12 లక్షలు లబ్ధి పొందినట్లు తెలిపారు.11 మంది రైతులకు దరఖాస్తు పట్టా భూమి 11.44 ఎకరాలకు ధ్రువపత్రాలు మంజూరు చేసినట్లు తహసీల్దార్ ప్రదీప్ తెలిపారు. బాలయ్యగారిపల్లె, కె.బాటవారిపల్లె పంచాయతీలలో ఝరికోన నీరు సరఫరా కావడం లేదని సర్పంచ్ విశ్వనాథ తెలిపారు.

అంతరిక్షాన అద్భుతం.. ఊరూరా సంబరం

- జయహో....చంద్రయాన్-3
- పాఠశాలలో సంబరాలు
- ఆలయాలు, మసీదుల్లో ప్రార్థనలు


వివేకానంద మున్సిపల్ పాఠశాలలో విజయసంకేతం చూపుతున్న విద్యార్థులు


పీలేరులో సంబరాలు చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మదనపల్లె సిటీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. రాకెట్ నుంచి విక్రమ్ ల్యాండర్ విడిపోయి బుధవారం సాయంత్రం 6.04 నిమిషాలకు చంద్రుడి దక్షిణ ధ్రువంలో సురక్షితంగా దిగింది. ప్రయోగం సఫలీకృతం కావడంతో కోట్లాది మంది భారతీయులు సంబరాలు చేసుకున్నారు. చంద్రయాన్-3 ప్రయోగాన్ని మదనపల్లెలోన ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేకంగా తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ప్యానెల్ ద్వారా విద్యార్థులు ప్రత్యేకంగా వీక్షించారు. మదనపల్లె పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలు (ఆర్‌ఆర్ లేవుట్, మాయాబజార్)లోని పాఠశాలల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రదర్శించి విద్యార్థుల్లో విజ్ఞానం కల్పించారు. ప్రయోగం విజయవంతం కావడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్ద నున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో చంద్రయాన్-3 విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకాలు చేశారు. దేశ పేరు ప్రఖ్యాతుల పెంచాలని చంద్రయాన్-3 విజయవంతం కావాలని కమిటీ సభ్యులు పూజలు చేశారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లోనూ చంద్రయాన్-3 ల్యాండింగ్ కార్యక్రమాన్ని టీవీల ద్వారా విద్యార్థులు వీక్షించారు. చంద్రుడిపై ల్యాండింగ్ కావడంతో భారతదేశం ఒక చరిత్ర సృష్టించిందని సంబరాలు జరుపుకున్నారు.

పీలేరులో సంబరాలు

పీలేరు : ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్- 3 విజయవంతం కావడం పట్ల పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో లయన్స్‌క్లబ్ సభ్యులు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం గర్వించేలా మొట్టమొదటి సారి చంద్రుని దక్షిణ ధృవంపై చంద్రయాన్ 3 విజయవంతంగా సేఫ్ ల్యాండ్ చేయడం అభినందనీయమన్నారు. అలాగే పట్టణంలోని పలు చోట్ల బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు సురేంద్రరెడ్డి, సుబ్రమణ్యం, జయచంద్రనాయుడు, మహేష్‌గుప్తా, శశిధర్‌రెడ్డి, సత్యంరెడ్డి, బాలాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంబరాలు

వాల్మీకిపురం: అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ 3 విజయవంతం కావడం పట్ల వాల్మీకిపురంలోని ముస్లింలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జామియా మసీదులో మగ్రిబ్ నమాజ్ తర్వాత ముస్లింలు పరస్పరం మిఠాయిలు తినిపించుకొని, జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ ఆనందోత్సవాలను జరుపుకున్నారు. భారతదేశంలో ముస్ముందు మరిన్ని విజయాలను సాధించి ప్రపంచంలోనే అగ్రదేశంగా నిలవాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఇమామ్ ముఫ్తీ రియాజ్ సాహెబ్, మౌల్వి అబ్దుల్ వలి సాహెబ్, హఫీజ్ షకూర్ సాహెబ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, విశ్రాంత హెచ్‌ఎం అమీర్ హుస్సేన్ సాహెబ్, ఉపాధ్యాయులు మహబూబ్ అలీఖాన్, జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జయహో భారత్

పెద్దతిప్పసముద్రం/ ములకలచెరువు : చంద్రయాన్ - 3 విజయవంతం కావడం పట్ల పెద్దతిప్పసముద్రం , మొలకలచెరువు మండలాల్లో ప్రజలు, విద్యార్థులు సంబరాలు చేశారు. పీటీఎం జెడ్పీహైస్కూల్ (తెలుగు)లో చంద్రయాన్-3 ల్యాండింగ్ కార్యక్రమాన్ని టీవీల ద్వారా విద్యార్థులు వీక్షించారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా బుధవారం సాయంత్రం విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై దిగిన ఘట్టాన్ని నిమ్మనపల్లెలోని విద్యార్థులు ప్రత్యక్షప్రసారంలో వీక్షించారు. రెడ్డివారిపల్లె మోడల్‌స్కూల్, ముష్టూరు కేజీబీవీ పాఠశాలలో ప్రయోగవీక్షణకై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చారిత్రాత్మక ఘట్టంలోని అపురూప క్షణాలను తిలకించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ల్యాండ్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

కలికిరిలో..

కలికిరి: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 విజయవంతంగా చంద్ర మండలం చేరుకునే మధుర క్షణాలను కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం సాయంత్రం ప్రత్యక్ష ప్రసారాలను విద్యార్థులు వీక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వీక్షించి సంబరాలు జరుపుకున్నారు.



మదనపల్లె : టీవీలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు, తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో...,


వాల్మీకిపురంలో..

చాలా థ్రిల్లింగ్‌గా ఉంది



చంద్రయాన్-3 విజయవంతం కావడంపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోకు అభినందనలు. ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3ను డిజిటల్ ప్యానల్ బోర్డులో వీక్షించాను. చాలా థ్రిల్లింగ్‌గా ఉంది.
-రాగిణి, పదో తరగతి, మదనపల్లె

ఎంతో ఆసక్తిగా చూశాను



భారత్ చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగాన్ని మా పాఠశాలలో టీవీలో ఆసక్తిగా చూశాను .అంతరిక్ష పరిశోధనల్లో భారత్ సత్తా చాటుతోంది.
-పి.అమీర్‌ఖాన్, 8వతరగతి, మదనపల్లె

గొప్ప ప్రయోగం



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం గొప్పది. ఈ ప్రయోగాన్ని ఎంతో ఉంతో ఉత్కంఠగా చూశాను. ఇక ముందు ఉన్న దశలను ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతం చేస్తారనే నమ్మకం ఉంది.
-కార్తికేయ, పదో తరగతి, మదనపల్లె

ప్రపంచ దేశాలకు ఆదర్శం



చంద్రయాన్-3 ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మారింది. మన పరిజ్ఞానం ప్రంచానికి చాటి చెప్పారు. 2025లో జపాన్‌తో కలిసి చంద్రుని దక్షిణ ధృవంపై రోవర్‌ను పంపే క్రమంలో మన పరిజ్ఞానాకి సవాలుగా భావించవచ్చు. **-వరప్రసాద్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, మదనపల్లె**

ఇంటింటి ఓటరు సర్వే వంద శాతం పూర్తి

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి


మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : నియోజకవర్గ వ్యాప్తంగా జూలై 21 నుంచి చేపట్టిన ఓటరుజాబితా ఇంటింటి సర్వే ప్రక్రియ 100 శాతం పూర్తయిందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తెలిపారు. బుధవారం సబ్‌కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సూపర్‌వైజర్లుతో ఆర్డీఓ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఓటరు జాబితా రూపకల్పన పారదర్శకంగా జరిగేందుకు రాజకీయపార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల సూపర్‌వైజర్లు బీఎల్వోల నుంచి ఫారం -9,10,11,11ఎ,11బిలు తీసుకునేటప్పుడు పరిశీలించాల్సిన అంశాలు, నియోజకవర్గ ఎన్నికల కార్యాలయానికి సమర్పించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించే విషయంలో బీఎల్వోలు కచ్చితంగా కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేయాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌పై అనేక ఓట్లకు సంబంధించి బీఎల్వోలు రాజకీయపార్టీల బీఎల్‌ఏలతో కలిసి పూర్తిస్థాయిలో విచారించాకే చర్యలు తీసుకోవాలన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో 1,33,201 గృహాలను సందర్శించి 2,48,062 మంది ఓటర్లను సర్వే చేయడం జరిగిందన్నారు. సమావేశంలో తహసీల్దార్‌లు మహబూబ్‌చాంద్, సీ.ఆర్.మంజుల, దైవరాజన్, వైఎస్సార్ సీపీ నాయకులు రమణారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ రెడ్డిసాహెబ్, సీపీఎం ప్రభాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలతో ప్రతి ఇంటా సంతోషం

–పల్లె బాటలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



చిన్న మొరవపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

కురబలకోట: పేద కుటుంబాలు సంతోషంగా ఉన్నాయంటే అది జగనన్న సంక్షేమ ఫలాలతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని మట్లివారిపల్లెలో జరిగిన పల్లెబాటలో పాల్గొన్నారు. గొడ్డిండ్లవారిపల్లె నుండి కడప హైవే రోడ్డు వరకు రూ. 1. 22 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు శిలాఫలక ఆవిష్కరణ, మట్లివారిపల్లెలో రూ. 16 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఆయన వివిధ సమస్యలపై ప్రజలను విచారించగా చెప్పుకునే స్థాయి సమస్యలు లేవన్నారు. కాలం బాగుంది..పాలన బాగుందని చెప్పడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇదంతా సీఎం జగన్ చలవేనన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశతోనే నేరుగా సీఎం జగన్ బటన్ నొక్కి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, వైస్ ఎంపీపీ ఎస్‌వి రమణారెడ్డి, సర్పంచ్ సోమిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి పలకరించి సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. డీఆర్. ఉమాపతిరెడ్డి, విశ్వనాధరెడ్డి, శివశంకర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి, ఎంపీటీసీ ముదివేటి ఆనందరెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీపీ రమణారెడ్డి,అర్జున్‌రెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పాలన

ములకలచెరువు: పేదల సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం మద్దినాయునిపల్లి, కురవపల్లె పంచాయతీల్లో ఎమ్మెల్యే పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డురాజులపల్లెలో సీసీ రోడ్డు, మురికి నీటి కాలువ వేయించాలని కోరగా త్వరగా పనులు చేయించాలని ఆ శాఖ అధికారులకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామక్రిష్ణంరాజును పరామర్శించారు. చంద్రరాజులపల్లె, యండ్లపల్లెలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్ల శిలాఫలకాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... వందశాతం హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని చెప్పారు. ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని, హామీ ఇస్తే పక్కాగా అమలుచేస్తుందని బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీకి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. మఠిగివారిపల్లెకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఒడుగుల ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, సర్పంచులు క్రిష్ణప్ప, జయచంద్ర, ఎంపీటీసీ సుధాకర్, నాయకులు భయ్యారెడ్డి, సిబ్బిరెడ్డి, బాబురెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వర్, విశ్వనాథ్, చాంద్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో నాలుగు దశాబ్దాల అభివృద్ధి


పల్లెబాట నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దతిప్పసముద్రం: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం జగనన్న ప్రోత్సాహంతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి నాలుగు దశాబ్దాల అభివృద్ధి చేసారని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, సుబ్బరాం, డ్రిప్ రమణ అన్నారు. పల్లెబాటలో భాగంగా బుధవారం ప్రజా ప్రతినిధులు, అధికారులు పోతుపేట పంచాయతీలో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు మంజూరు చేస్తోందని, అర్హత ఉండి లబ్ధి చేకూరకుంటే తమ దృష్టికి తీసుకు రావాలని ప్రజలను కోరారు. ప్రధానంగా హౌసింగ్ లేఅవుట్, బిల్లుల మంజూరు విషయంలో పలువురు పాలకుల ఎదుట అసహనం వ్యక్తం చేయగా అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ప్రజా ప్రతినిధులు మండి పడ్డారు. సిమెంటు, రోడ్లు, మురికినీటి కాలువలు ఏర్పాటు చేయాలని పలువురు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. పోతుపేట అంబేద్కర్ కాలనీలోని మహిళలు కేవీ రమణ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రజా ప్రతినిధులు,నాయకులు నారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, నాగార్జునరెడ్డి, కోట్లోని వెంకటరెడ్డి, కొండా చినపరెడ్డి, బత్తల జయరాం రెడ్డి, శ్రీరాములురెడ్డి, అంగడి శివ, రియాసత్ అలీఖాన్, గిరిస్వామి, సాయి, అభి, పీఎస్ మధు, బొమ్మే వెంకట్, సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్ నాయుడు, మోహన్‌రెడ్డి, శివాల ప్రదీప్, ఉత్తన్నతో పాటు మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం

బి.కొత్తకోట: మండలంలో జరిగిన అభివృద్ధి పనులు, ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం చేపట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ ఎస్.ప్రదీప్‌రెడ్డి అన్నారు. బుధవారం బడికాయలపల్లె పంచాయతీలో అధికారులు, ప్రజాప్రతినిధులు పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్తి చేసిన కాలువలు, సిమెంటురోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. తహసీల్దార్ రఫీక్ అహమ్మద్, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, వైస్ ఎంపీపీపీ ఖాదర్‌వలీ, రాధ, సర్పంచులు అదెప్ప, భీమిగాని నాగిరెడ్డి, ఉమామహేశ్వరీ, లక్ష్మిదేవి, సాంబశివ, రామక్క, గిరిజ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.


ఉర్దూ భాషాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కలికిరి: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఉర్దూ భాషాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. కలికిరి పట్టణ పరిధిలోని ఉర్దూ అకాడమి కంప్యూటర్ శిక్షణ కేంద్రం, ఉర్దూ గ్రంధాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ బాషాభివృద్ధిలో భాగంగా ఉర్దూ అకాడమీతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎంఓయూ కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాలను యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకునే విధంగా ఉర్దూ అకాడమీ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెంటర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఖాన్ ఖలీల్ సాహెబ్, సీటీసీ ఇంచార్జ్ నాజియా, గ్రంథాలయ అధికారి జావీద్ హుస్సేన్, సిబ్బంది షాజహాన్, ఉమర్ పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు జమ చేయండి

పీలేరు : మండలంలో దొడ్డిపల్లె, యర్రగుంటపల్లె పంచాయతీల్లో ఇంటి పట్టాలు పొందిన మాజీ సైనికోద్యోగులు పట్టాలు తమ వద్ద జమ చేయాలని మాజీ సైనికోద్యోగులు సంఘం అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి తెలిపారు. శాశ్వత పట్టాలు పొందేందుకు వీలుగా పాత పట్టాలు రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 27వ తేదీ లోపు తమ కార్యాలయంలో పట్టాలు జమ చేయాలని కోరారు.

అభివృద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ నూర్జహాన్

కలికిరి: మండల పరిధిలో వివిధ దశలలో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మండల సాధారణ సమసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల పరిధిలో ఎంపీ లాడ్స్, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఏడాది డిసెంబరు నెల లోపు తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పనులకు నిధులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అనంతరం శాఖల వారిగా ఆయా శాఖల ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, చేపట్టబోయే ప్రణాళికలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు భాగ్యలత, ఏఈలు వెంకటేష్, ఆబిద్, చక్రపాణి, ఎంఈఓ కరీముల్లా, ఎంఈఓ-2 నాగార్జునరెడ్డి, ఏపీఓ సుజాత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఐసీడీఎస్ సూపర్వైజర్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి

కేవీపల్లె : సమష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి చెద్దామని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని కోరారు. మండలంలోని గుర్రెడ్డిగారిపల్లె, కంభంవారిపల్లె, యర్రజేనుపల్లెలోని ముస్లింలకు కంభంరాయునిచెరువు వద్ద ఉన్న ఈద్గా స్థలాన్ని అభివృద్ధి చేయాలని మండల కోఆప్షన్ సభ్యుడు సైపుల్లాఖాన్ కోరారు. గుర్రెడ్డిగారిపల్లె తారు రోడ్డు నుంచి ఈద్గా వద్దకు తారు రోడ్డు ఏర్పాటు చేయాలని విన్నవించారు. అనంతరం వివిధ శాఖల మండల స్థాయి అధికారులు మండలంలో జరిగిన ప్రగతి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, హరిబాబు, తహశీల్దార్ నరసింహులు, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల

కలకడ : సహకార బ్యాంకుల ద్వారా రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కలకడ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో సహకార బ్యాంకు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగ ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 2017-18 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రద్దు చేసిన రూ.25వేల కోట్లు విలువ చేసే డీకేటీ నిషేధిత భూములను 22ఏ ద్వారా రిజిస్ట్రేషన్‌కు అనుమతి మంజూరు చేశారన్నారు. ఇకపై రెవెన్యూ అధికారులు రైతులు సాగుచేస్తున్న 2 0సంవత్సరాలు అనుభవం కలిగిన సాగు రైతులకు పట్టా మంజూరు చేయడం జరుగుతందన్నారు. కలకడలో సర్వేనెంబర్ 170 లోని 14ఎకరాల భూమిలో ఇంటి నిర్మాణాలు చేపట్టారని, వాటికి ఉన్న అడ్డంకులు తొలగించి రిజిస్ట్రేషన్‌కు అనుమతి మంజూరు చేసిన కలెక్టర్ గిరిషా పీఎస్‌కు, రెవెన్యూశాఖ సిబ్బందికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సింగిల్ విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఈశ్వర్‌నాయుడు, పురుషోత్తంనాయుడు, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

కలకడ సింగిల్ విండో నూతన పాలక వర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా భీమవరం.వెంకట్రమణరెడ్డి (బాబురెడ్డి), డైరెక్టర్‌లుగా పి.క్రిష్ణయ్య, టిఎస్ సుల్తానీబాషా ప్రమాణ స్వీకారం చేశారు.

కమనీయం.. పట్టాభి రాముడి పట్టాభిషేకం


గరుడ వాహనంపై ఊరేగుతున్న పట్టాభిరాముడు

వాల్మీకిపురం: టీటీడీ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం శ్రీ పట్టాభి రామాలయంలో బుధవారం శ్రీరాముడికి పట్టాభిషేక మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. విశేషాలంకరణలో ముస్తాబైన సీతారాముల వారిని ఊంజల్ సేవ మండపానికి తీసుకెళ్లి అధిరోహింపజేశారు. వేదపండితులు స్వామివారి పట్టాభిషేక మహోత్సవ ఘట్టాన్ని భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి సీతారాములు గరుడ వాహనంపై నాలుగుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించిన భక్తులు పరవశించిపోయారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు


పల్లెబాటలో అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దమండ్యం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందిస్తున్నట్లు ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని శిద్దవరం పంచాయతీలోని చింతమానువారిపల్లె, కోటగుట్టపల్లె, బాటవారిపల్లె, శిద్దవరం, గాజులపల్లె, మల్లయ్యగారిపల్లె, చెరువుకిందపల్లె, జిల్లావాండ్లపల్లె, శివపురం పంచాయతీలోని బుషిరెడ్డిగారిపల్లె, కనకంటివారిపల్లె, గొల్లపల్లె, పోరెడ్డిగారిపల్లె, నారపురెడ్డిగారిపల్లె, శివపురం, శివపురం జరిజనవాడల్లో బుధవారం అధికారులతో కలిసి పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎంపీపీ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, తహసీల్దార్ రాము, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ సర్పంచ్‌లు కె విజయకుమారి, గంగులమ్మ, ఎంపీటీసీ రుక్మాంగధరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చాను, నాయకులు కె. చంద్రమోహనరెడ్డి, నరసింహులు, సుధాకరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పల్లెబాటలో సమస్యల పరిష్కారం

తంబళ్లపల్లె: పల్లెబాట కార్యక్రమంలో పలు సమస్యలు పరిష్కరిస్తున్నామని రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ తెలిపారు. బుధవారం అన్నగారిపల్లె, గంగిరెడ్డిపల్లె పంచాయతీలలో పల్లెబాట నిర్వహించారు. ప్రతి పల్లెలోనూ ఇంటింటికీ వెళ్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని అక్కడే పరిష్కరించారు. సంక్షేమ పథకాలతో జరిగిన లబ్ధి, కుటుంబాలలో మార్పు అంశాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ ఉదయ్‌కుమార్‌రెడ్డి(బాబురెడ్డి), తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్రనాథ్, సీడీపీవో నాగవేణి, ఏపీయం గంగాధర్, ఏపీవో అంజనప్ప, నాయకులు రవినాయక్, తులసీనాయక్, కోటిరెడ్డి, శివారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.